క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



దోమకొండ: మండల కేంద్రానికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ గుండా రాజేష్, రెండు రోజుల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందారు. గురువారం సహచర మిత్రులు కామారెడ్డి ల్యాబ్ అసోసియేషన్ తరపున రూ.31 వేలు ఆర్థిక సాయంగా అందజేశారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కందాడి సాయిరెడ్డి, ఉపాధ్యక్షుడు ఆకుతోట శ్రీధర్, ప్రధాన కార్యదర్శి బల్ల సంతోష్, తదితరులు రాజేష్ కుటుంబసభ్యులకు నగదును అందజేసి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో భవన నిర్మాణ కార్మికులు గురువారం వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. ఫిబ్రవరి 3న నిర్వహించే మహాధర్నా కార్యక్రమానికి భవన నిర్మాణ కార్మికులు తరలి వచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి సాయికుమార్ తెలిపారు. ప్రభుత్వం కార్మికుల సంక్షేమ పథకాలను ప్రైవేటు పరం చేయాలని చూస్తున్నదని, ఇలా చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని అన్నారు. సంఘం నాయకులు శ్యాం, తుకారాం, రజాక్ తదితరులున్నారు.

స.హ.చట్టం క్యాలెండర్..



కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ క్యాలెండర్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో స.హ.చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం, రాష్ట్ర అధ్యక్షుడు మారవేణి రాజన్న, జిల్లా అధ్యక్షుడు శివపూజ లింబయ్య, ప్రతినిధులు సిర్నాపల్లి ప్రదీప్ కుమార్, తిరుకుల రవి, కాసర్ల లింగం, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

బాలుకు రక్త్‌వీర్ సమ్మాన్ పురస్కారం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి రక్తదాతల సమూహం వ్యవస్థాపకుడు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త, ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ ఎన్.బాలుకు రిపబ్లిక్ డే సందర్భంగా మధ్యప్రదేశ్ రాష్ట్రం ఖాండ్వాకు చెందిన నయాన్ ఆగ్రో లిమిటెడ్ రక్త్‌వీర్ సమ్మాన్(ఉత్తమ బ్లడ్ డోనర్, సోషల్ వర్కర్) పురస్కారం ప్రకటించింది. 17 సంవత్సరాలుగా బాలు ఇప్పటికి 75 సార్లు రక్తదానం చేశారు. దీంతో కామారెడ్డి రక్తదాతల సమూహం ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో నమోదైంది.

డీట్‌తో ఉద్యోగ అవకాశాలు



బాన్సువాడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన డీఈఈటీ(డీట్) కార్యక్రమం ద్వారా విద్యార్థులు, నిరుద్యోగులకు అనేక ఉద్యోగ అవకాశాలు వస్తాయని శ్రీరాం నారాయణఖేడియా ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వేణుగోపాల స్వామి అన్నారు. గురువారం కళాశాలలో విద్యార్థులకు డీట్‌పై అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ చిరంజీవి డీట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకునే విధానాన్ని వివరించారు. అధ్యాపకులు వినయ్‌కుమార్, పోతరాజు శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణ సభకు తరలిన నేతలు



బాన్సువాడ రూరల్: నిజామాబాద్‌లో జరిగిన రాజ్యాంగ పరిరక్షణ సభకు బాన్సువాడ డివిజన్ అంబేడ్కర్ సంఘం నాయకులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. సభకు గాయకుడు, రచయిత రెంజర్ల రాజేష్, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు చెన్నయ్య హాజరవుతున్నారని వారు తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింలు, బంగారు మైసయ్య, గైని రవి, మన్నె చిన్న సాయిలు, ప్రవీణ్, బేగరి సాయిలు, మోహన్, పోతరాజు సాయిలు తదితరులున్నారు.



భిక్కనూరులో..



దోమకొండ మండల కేంద్రంలో..



బాన్సువాడలో..బీఆర్‌ఎస్ నాయకులు



నివాళులర్పిస్తున్న ముంబోజీపేటతండా యువకులు

నేతాజీకి ఘన నివాళులు

స్వాతంత్య్ర సమరయోధుడు, నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని జిల్లాలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..దేశం కోసం ప్రాణాన్ని సైతం లెక్కచేయకుండా పోరాడిన సైనికుడని కొనియాడారు. భారత దేశ ప్రజలను ఏకతాటిపై తీసుకొచ్చేందుకు ఆయన చేసిన కృషిని గుర్తుచేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పిట్లంలో సుభాష్ చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నేతాజీ సంఘం సభ్యులు



రామారెడ్డిలో..



తాడ్వాయిలో..



వదల్‌పర్తి పాఠశాలలో .. ఉపాధ్యాయులు

పేదలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

మాచారెడ్డి: అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు వర్తిస్తాయని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డి.శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని అక్కాపూర్, కొత్తపల్లి గ్రామ సభల్లో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకాల కోసం ఇంతకుముందు దరఖాస్తు చేయని వారు ప్రస్తుత గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. పాల్వంచ, మాచారెడ్డి తహసీల్దార్లు లక్ష్మణ్, శ్వేత, ఎంపీడీవో గోపిబాబు, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావ్, తదితరులు ఉన్నారు.



అక్కాపూర్ గ్రామ సభలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



కామారెడ్డి అర్బన్: పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకొని నేరాల అదుపు చేయడానికి, నేరస్తులను పట్టుకోవడానికి సహకారం అందించాలని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని ప్రియాడీలక్స్‌రోడ్డులో నాయకులు, ప్రజలు, వర్తకులు, దుకాణాల యాజమానులతో సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సీసీ కెమెరాల ఏర్పాటు కోసం వార్డు కౌన్సిలర్లు చాట్ల రాజేశ్వర్, బీజేపీ ఫ్లోర్ లీడర్ ఎం.శ్రీకాంత్ చెరో రూ.25 వేల చొప్పున విరాళం అందజేస్తామని సమావేశంలో ప్రకటించారు.

రైతులకు రుణాలు మంజూరు చేయాలి



లింగంపేట(ఎల్లారెడ్డి): సొసైటీల్లో రైతులకు వెంటనే రుణాలు మంజూరు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ డిమాండు చేశారు. గురువారం ఆయన లింగంపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. లింగంపేట మండలం నల్లమడుగు, లింగంపేట, శెట్పల్లిసంగారెడ్డి సొసైటీల్లో వందలాది మంది రైతులు రుణాల కోసం దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. భాస్కర్, సావిత్రి, రాములు, మధు, రైతులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహం ఊరేగింపు



సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అయ్యప్ప స్వామి విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నంది విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ఊరేగించారు. భాజాభజంత్రీల మధ్య, అయ్యప్ప స్వాముల నామ స్మరణతో వీధులు మారుమ్రోగాయి. కళాకారులు వివిధ రకాల నృత్యాలు చేశారు. భారీ ఎత్తున భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న నిలదీతలు



ఉత్తునూర్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

గ్రామసభల్లో గందరగోళం కొనసాగుతోంది. సారూ రేషన్ కార్డు జాబితాలో మా పేరు లేదు. సారూ ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో తమ పేరు లేదు... అంటూ వివిధ పథకాల అర్హుల జాబితాలో పేర్లు లేకపోవడంతో ఆశావహులు ప్రభుత్వ అధికారులను నిలదీశారు. అనర్హుల జాబితాలో తమ పేరు రావడానికి గల కారణాలు ఏంటో చెప్పాలని అధికారులను డిమాండ్ చేశారు. అధికారులు వారిని సముదాయించి ప్రత్యేకంగా దరఖాస్తులు స్వీకరించడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. కొన్ని చోట్ల పోలీసులు పర్యవేక్షణలో గ్రామసభలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



మిర్జాపూర్‌లో రేషన్‌కార్డు అర్హుల జాబితాలో పేరు రాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్న గ్రామస్తుడు



ఉప్పల్‌వాయి గ్రామ సభలో ప్రజలను సముదాయిస్తున్న పోలీసులు



కామారెడ్డి మున్సిపల్ 26వ వార్డులో దరఖాస్తు స్వీకరిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్



సుల్తాన్‌నగర్ గ్రామ సభలో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్



తుక్కిపల్లిలో.. కాంగ్రెస్ మహమ్మద్‌నగర్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి

కబ్జాలను అడ్డుకోవాలని వినతి

రాజంపేట: రాజంపేట పీహెచ్‌సీకి సంబంధించిన 12 గుంటల భూమి, సర్వే నెంబర్–576, 569లలో ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన వీరన్నపటేల్, ముత్యపుసిద్ద రాములు, కృష్ణారెడ్డి, అక్బర్ అలీలు గురువారం ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1993లో విరాళాల ద్వారా సేకరించిన డబ్బులతో రాజంపేటలోని సర్వే నెంబర్–637లో రెండు ఎకరాల భూమిని కొని జూకంటి మోహన్ రెడ్డితో పాటు మరో 10 మంది కలిసి సబ్ రిజిస్ట్రార్ దోమకొండలో డీఎంహెచ్‌వో(నిజామాబాద్) పేరున రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఆ స్థలములో పీహెచ్‌సీ నిర్మించగా.. మిగులు భూమి 12 గుంటలను జూకంటి మోహన్ రెడ్డి కబ్జా చేసుకొని ఆ తర్వాత స్థలాన్ని చందవు సత్యనారాయణ రెడ్డి పేరున రిజిస్ట్రేషన్ చేసినట్లు పేర్కొన్నారు. ఆ స్థలం గురించి గ్రామస్తులు ఎవరు ఎదిరించినా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వ అండతో చాలా మందిపై కేసులు పెట్టించాడని వివరించారు. అలాగే సర్వే నెంబర్–576, 569 లో సుమారు 20 ఎకరాల ప్రభుత్వ స్థలాలు కబ్జా చేసుకొని వారి కుటుంబ సభ్యుల పేరున మార్చుకొని వాటిపైన పాసు పుస్తకాలు తీసుకొని రైతు బంధు, రుణమాఫీ కూడా పొందుతున్నాడని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేయించాలని షబ్బీర్ అలీని కోరారు.



షబ్బీర్ అలీకి వినతి పత్రం అందజేస్తున్న రాజంపేట గ్రామస్తులు

హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలి



కామారెడ్డి టౌన్: హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని పట్టణ ట్రాఫిక్ ఎస్సై మహేశ్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలో సెల్ టవర్ల వద్ద విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. సెల్‌టవర్లకు సంబంధించి అత్యవసరమైన కాల్స్ వస్తే అతివేగంగా వాహనాలపై వెళ్లవద్దని, ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని సూచించారు. సెల్‌టవర్స్ కంపెనీ ప్రతినిధులు, సిబ్బంది నాగార్జున, సిద్ధార్థ, అనిల్‌కుమార్, భైరవప్రసాద్ తదితరులున్నారు.

న్యాయశాఖ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



కామారెడ్డి అర్బన్: జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం కొత్త సంవత్సరం డైరీని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్ వీఆర్‌ఆర్ వరప్రసాద్ ఆవిష్కరించారు. గురువారం జిల్లా కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యాయశాఖ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు జమాల్‌పూర్ భుజంగ్‌రావు, ప్రధాన కార్యదర్శి నిమ్మ వెంకట్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీధర్, కోశాధికారి నాగేంద్ర, ఉపాధ్యక్షులు రషీద్‌అలీ, పరిపాలన అధికారి జి.శ్రీదేవి, ప్రతినిధులు నిఖిల్‌రెడ్డి, ఆనంద్, రజనీప్రియ, కరుణ పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక





పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సీహెచ్ శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో టీపీటీఎఫ్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శిగా శ్రీధర్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా నాగభూషణం, శ్రీనివాస్, ఆర్.మౌనిక, కార్యదర్శులుగా బలరాం, విట్టల్, అశోక్, భూలక్ష్మీలు ఎన్నికయ్యారు.

రాజరాజేశ్వర ఆలయ కార్యవర్గం..

రామారెడ్డి: పోసానిపేట గ్రామంలోని సుప్రసిద్ధ ఆలయంగా పేరుగాంచిన రాజరాజేశ్వర ఆలయం నూతన కార్యవర్గాన్ని గురువారం వీడీసీ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నారెడ్డి మహిపాల్ రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా బండి పోచయ్య, ఉపాధ్యక్షులుగా చిందం కృష్ణ, గాండ్ల రవి, సెక్రెటరీగా పోతుల పెద్ద భాస్కర్ రెడ్డి, కోశాధికారిగా చిదుర నరేష్ తదితరులు ఎన్నికయ్యారు. వీడీసీ అధ్యక్షుడు శనిగరపు సాయిలు, ఉపాధ్యక్షుడు ప్రవీణ్, కార్యదర్శి రాజు, కోశాధికారి నర్సింలు, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాత కార్మికులను తొలగించొద్దు



భిక్కనూరు: తొమ్మిదేళ్లుగా టోల్‌ప్లాజాలో పనిచేస్తున్న తమను తొలగిస్తామంటూ నూతన కాంట్రాక్టర్ కొత్త రిక్రూట్‌మెంట్ ప్రకటన ఇవ్వడాన్ని నిరసిస్తూ భిక్కనూరు టోల్‌ప్లాజా వద్ద కార్మికులు గురువారం ధర్నా చేశారు. తమను తొలగించవద్దని, వేతనాలను తగ్గించవద్దంటూ డిమాండ్ చేశారు. తమకు వేతనాలు పెంచడంతో పాటు ఏ ఒక్క కార్మికుడిని కూడా తొలగించవద్దని వారు నినదించారు. ఏ ఒక్క కార్మికుడిని తొలగించినా పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. టోల్‌ప్లాజా కార్మికసంఘం అధ్యక్షుడు కాసర్ల నర్సాగౌడ్, ఉపాధ్యక్షుడు తమ్మల సిద్ధరాములు, తదితరులు పాల్గొన్నారు.

సన్నాహక సదస్సును విజయవంతం చేయాలి



బాన్సువాడ: నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిర్వహించబోయే వేల గొంతులు– లక్ష డప్పుల సన్నాహక సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గరుగుల్ల బాల్‌రాజ్ అన్నారు. గురువారం బాన్సువాడలో ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రద్దు చేయాలని ఒక వర్గం డిమాండ్ చేస్తోందని, ఈ పోరులో మాదిగల సత్తా చాటాలని అన్నారు. ఈ సదస్సుకు ఎమ్మార్పీస్ అధినేత మందకృష్ణ మాదిగ వస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గంగాధర్, శేఖర్, సాయిలు, హన్మండ్లు, తదితరులున్నారు.

అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలి

పెద్దకొడప్‌గల్(జుక్కల్): అర్హతున్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి తెలియజేశారు. గురువారం లింగంపల్లిలో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో సబ్ కలెక్టర్ కిరణ్మయి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న సంక్షేమ పథకాల వివరాలను గ్రామస్తులకు తెలియజేశారు. ఎంపీడీవో లక్ష్మీకాంత్ రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

సంక్షిప్తం

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని కరక్‌వాడిలో గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించినట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తూర్పు రాజు, కామెల్లి బాల్‌రాజు, లైన్ రమేష్‌లు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు శివాలయం నుంచి గ్రామ రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం కోసం రూ.5 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు.

దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరణ

బిచ్కుంద(జుక్కల్): మండలాల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ అధికారులు దివ్యాంగుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. వికలాంగులకు కావలసిన పరికరాలు అందించడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని ఐసీడీఎస్ జిల్లా అధికారి ప్రేమల తెలిపారు. దివ్యాంగుల అవసరం మేరకు వీల్‌చైర్, ట్రైసైకిల్, చెవిటి వారికి వినికిడి పరికరాలు, చంక పరికరాలు ఇవ్వనున్నట్లు చెప్పారు.

పండరీపురానికి భక్తుల పాదయాత్ర



గాంధారి(ఎల్లారెడ్డి): మహారాష్ట్రలోని పుణ్యక్షేత్రం పండరీపురానికి మండల కేంద్రం నుంచి భక్తులు పాదయాత్ర చేస్తున్నారు. భక్తుల పాదయాత్రను కాంగ్రెస్ పార్టీ నాయకులు తూర్పు రాజు, ఆకుల లక్ష్మణ్ స్థానిక విఠలేశ్వర మందిరంలో ప్రారంభించారు. భక్తులు ప్రతి ఏటా పాదయాత్ర చేస్తూ పండరీపురం చేరుకుని విఠలేశుడిని దర్శించుకుని వస్తారు.

పలు పాఠశాలల తనిఖీ



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మారెడ్డి, రత్నాపూర్, ఆజామాబాద్ గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో వెంకటేశం తనిఖీ చేశారు. విద్యార్థులకు సక్రమంగా బోధన చేయాలని, ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని సూచించారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



లింగంపేట(ఎల్లారెడ్డి): అయ్యపల్లితండాకు చెందిన మునావత్ రమేశ్ తన సెల్‌ఫోన్ పోయిందని లింగంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా మొబైల్‌ను ట్రేస్ చేసి అనంతరం రికవరీ చేసి గురువారం బాధితుడికి అందజేసినట్లు ఎస్సై తెలిపారు.